క్లుప్తంగా

పైప్‌లైన్ పనుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, జేఈ బాలచంద్రాచారి తనిఖీ చేశారు. మండలంలోని బూర్లపల్లి, రేకులగుంటిపల్లి, పోతుపేట, చెన్నరాయునిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, సింటెక్స్ ట్యాంక్, పైప్‌లైన్ పనులను తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం అధికారులు రంగసముద్రంలో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులచే ర్యాలీ చేపట్టారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి


చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించిన సీపీఎస్ ఉద్యోగులు

కేవీపల్లె: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో డిసెంబర్ 10న చేపట్టనున్న సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఉద్యోగులు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నట్లు తెలిపారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతున్న కూటమి ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వై.వి. రమణ, సుబ్రమణ్యం, నందకుమార్, హరినాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వేగన, ప్రభిత, భారతి తదితరులు పాల్గొన్నారు.

'అవహేళన చేయడం దుర్మార్గం'

పీలేరు: వలంటీరు వ్యవస్థ గురించి అవహేళన చేస్తూ రాష్ట్ర మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.ఎల్. వెంకటేష్ విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అధికారం కోసం వలంటీర్లకు రూ. 10 వేలు జీతం ఇస్తామని మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థే లేదంటూ మాట్లాడటం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

దారి ఆక్రమణపై నిరసన


నిరసన తెలుపుతున్న హౌసింగ్ లబ్ధిదారులు

పీలేరురూరల్: మండలంలోని ఏపీఐఐసీ లేఅవుట్ 1 హౌసింగ్ కాలనీ దారి స్థలం ఆక్రమణపై హౌసింగ్ లబ్ధిదారులు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్‌లో మంజూరైన రోడ్డును కొందరు ఫెన్సింగ్ వేసి ఆక్రమించారని, సుమారు 300 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు మెటీరియల్ తీసుకెళ్లాలంటే ట్రాక్టర్లు వెళ్లేందుకు దారి లేదని చెప్పారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

కలకడ: 104 సిబ్బంది సమస్యలను పరిష్కరించి ఉద్యోగులను ఆదుకోవాలని 104 సిబ్బంది, మండల ఉపాధ్యక్షుడు ఎనుగొండపాళ్యం ఎంపీటీసీ సభ్యులు ఈశ్వర్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీలో సేవలు అందించడానికి వెళ్లిన 104 సిబ్బంది వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి మండల పరిషత్ ద్వారా తెలియజేయాలని విన్నవించారు. నెలవారి జీతం కూడా సక్రమంగా ఇవ్వడం లేదని వాపోయారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని 104 వాహనానికి బీమా, ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో 104 డ్రైవర్ రమేష్ బాబు, డీఈఓ రోజా పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీఈఓ శివశంకర్

పీలేరు రూరల్: హౌసింగ్‌లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ శివశంకర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 5,077 ఇళ్లు మంజూరయ్యాయని, 1,812 ఇళ్లు ఇప్పటి వరకు పూర్తి అయినట్లు తెలిపారు. 165 మోల్డింగ్ దశలో, 405 గోడల దశలో, 2,250 గుణాంతాల దశలో ఉన్నట్లు తెలిపారు. 424 ఇళ్లు ఇంకా మొదలు పెట్టలేదని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి డిసెంబర్ 31లోపు నిర్మాణాలు పూర్తి అయ్యేలే అధికారులు కృషి చేయాలన్నారు. హౌసింగ్ డీఈ రమణ, ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణం నత్తనడక

- హౌసింగ్ లే అవుట్లలో సౌకర్యాల కొరత
- మండల మీట్ వాయిదాతో మూలుగుతున్న నిధులు


కందుకూరు లే అవుట్‌లో ట్యాంకర్‌తో నీటిని తరలిస్తున్న లబ్ధిదారులు

పెద్దతిప్పసముద్రం: 'మీరేం చేసుకుంటారో మాకు అనవసరం, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలి' అంటూ కలెక్టర్, హౌసింగ్ పీడీ ఆదేశిస్తున్నా ఇక్కడ మాత్రం అధికారులకు పట్టడం లేదు. క్షేత్ర స్థాయిలో గృహ నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయి. ఇంటి స్థలాలు లేని లబ్ధిదారులకు ప్రభుత్వం లే అవుట్ల ద్వారా స్థలం చూపినా, మౌలిక వసతులు లేని కారణంగా నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.

- తంబళ్లపల్లి నియోజకవర్గంలో మొత్తం 12,392 పక్కా గృహాలు మంజూరయ్యాయి. కేవలం 6,233 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. పునాదులు కూడా వేయని ఇళ్లు 112 ఉన్నాయి. మండలంలోని టి.సదుం లే అవుట్‌లో పైప్‌లైన్ సౌకర్యం లేదు. మల్లెలలో బోరున్నా మోటారు, పైప్‌లైన్ సమస్య ఉంది. పులికల్లులో బోరు వద్ద విద్యుత్తు, పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదు. పెద్దతిప్పసముద్రంలో పైప్‌లైన్, మట్టి రోడ్డు, సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేయాల్సి ఉంది. కందుకూరు లే అవుట్‌లో బోరున్నా పైప్‌లైన్‌తో పాటు విద్యుత్తు సమస్య ఉంది. దీంతో ఇళ్ల నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయి. మరి కొందరేమో అధికారుల ఒత్తిడి భరించలేక ట్యాంకర్లతో నీరు తెచ్చి నిర్మాణాలు చేపడుతున్నారు.

సమస్యలు తీరేదెలా...?

లే అవుట్లలో మౌలిక వసతుల కల్పనకు మండల గ్రాంట్‌లో నిధుల కేటాయింపు చేయవచ్చు. ఇది జరగాలంటే మండల్ మీట్‌లో సభ్యులు తీర్మానం చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడా సర్వసభ్య సమావేశాలు జరగలేదు. కూటమి నాయకులు అడుగడుగునా అడ్డు కోవడమే ఇందుకు కారణం. మరి పనులు ఎలా జరుగుతాయి? సమస్యలు ఎలా తీరుతాయంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరు మండలాల్లో కోట్ల రూపాయల నిధులు మూలుగుతున్నాయి.

లబ్ధిదారులు ముందుకు వస్తే రుణ సౌకర్యం



గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తే రుణాలిప్పిస్తాం. సదరు మహిళ డ్వాక్రాలో సభ్యురాలిగా ఉంటే ఆమె సంఘాల్లో లక్ష రూపాయల వరకు రుణ సౌకర్యం కల్పిస్తాం. హౌసింగ్ బిల్లులు ఎక్కడా పెండింగ్‌లో లేవు. లే అవుట్లలో సమస్యలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. గృహ నిర్మాణం వేగవంతం చేస్తాం. – వెంకట్‌రెడ్డి, హౌసింగ్ డీఈ, మదనపల్లి

ఆక్రమణల తొలగింపు

- విశాలంగా మారిన రహదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


బి.కొత్తకోట పీటీఎంరోడ్డులో మురికినీటి కాలువపై ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

బి.కొత్తకోట: నగర పంచాయతీ కేంద్రం బి.కొత్తకోటలో బుధవారం ఆక్రమణల తొలగింపు మొదలైంది. మూడు దశాబ్దాలుగా ఆక్రమణలతో కుచించుకుపోయిన రహదారులపై ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్య తీర్చాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకోలేదు. ఆక్రమించిన రహదారులపై బంకులు ఏర్పాటు చేసుకోవడం, వాటిని అద్దెలకు ఇచ్చుకుంటూ నగర పంచాయతీకి భారీగా ఆదాయానికి గండి పడింది. దీనిపై చర్యలు తీసుకునేందుకు ప్రస్తుత నగర పంచాయతీ, పోలీసు అధికారులు సిద్ధం కావడంతో ఎవరూ ఊహించని విధంగా చర్యలు మొదలయ్యాయి.

కాలువను ఆక్రమించి వ్యాపారాలు

బి.కొత్తకోట పట్టణంలో ప్రధానమైన మదనపల్లె, పీటీఎం, రంగసముద్రం, బీరంగి రోడ్లు సువిశాలమైనవి. ఈ రోడ్లకు ఇరువైపులా ఉన్న మురికినీటి కాలువలను ఆక్రమించి రోడ్లపైకి వచ్చారు. ఫలితంగా రహదారుల విస్తీర్ణం తగ్గిపోయింది. జ్యోతిచౌక్‌లో దీనికంటే భిన్నమైన పరిస్థితి. ఆక్రమణలతో దుకాణాలు వెలశాయి. రహదారిని ఆక్రమించేశారు. దీనితో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వీటిని తొలగించాలని కమిషనర్ పల్లవి, సీఐ రాజారెడ్డి నిర్ణయించారు. స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు అవకాశం ఇచ్చారు. చెప్పినట్టుగా బుధవారం ఆక్రమణల తొలగింపు పర్వం మొదలైంది.

వేగంగా పనులు

బి.కొత్తకోటలో తొలిసారి 1993 డిసెంబర్‌లో ఆక్రమణల తొలగించారు. అప్పటి ఎమ్మార్వో నారాయణస్వామి, ఎస్ఐ ఎస్‌వీ.రమణ రోడ్లకు ఇరువైపులా ఆక్రమించిన స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి నిన్నటిదాక ఆక్రమణలు భారీగా పెరిపోయినా తొలగింపు ప్రక్రియ చేపట్టలేదు. ఈ నేపథ్యంలో అధికారులు మైక్ ద్వారా పట్టణ వ్యాపారులకు ప్రచారం చేశారు. స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించకుంటే తామే తొలగిస్తామని ప్రకటించిన మేరకు చర్యలు చేపట్టారు. సీఐ రాజారెడ్డి, కమిషనర్ పల్లవి, మేనేజర్ రమాదేవి, ఏఈ రాజేంద్ర, నగర పంచాయతీ సిబ్బంది ఆక్రమణల తొలగింపు చేపట్టారు. జేసీబీలతో మురికికాలువలపై ఆక్రమణలను తొలగించారు. జ్యోతిచౌక్‌లో బంకులు, రక్షిత నీటి పథకం కింద వేసుకున్న బంకులను పూర్తిగా తొలగించారు. బస్‌షెల్టర్‌ను ఆక్రమించి వేసుకున్న పూల దుకాణాలను, అందులోని సామగ్రిని, అంబేడ్కర్ విగ్రహం చుట్టూ పెట్టుకున్న వ్యాపారాలను తొలగించారు. రంగసముద్రం రోడ్డులో వ్యాపారులు రోడ్డుపై పెట్టుకున్న బోర్డులు, షాపులను తొలగించారు. బీరంగిరోడ్డులో ఇంకా చర్యలు మొదలుకాకనే దుకాణాల యజమానులు ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు.

రైతులకు ద్రోహం చేస్తున్న ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని ఉసిరికాయలపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యం కుమారుడు గురుచరణ్ అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చేరుకొన్న మాజీ ఎమ్మెల్యే గురుచరణ్ మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మర్రిపాడులో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన రైతులకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు ఉచిత పంటలబీమా అందించామని తెలిపారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని రైతుల నెత్తినే వేయడం దారుణమన్నారు. దీంతో రైతులపై మోయలేని భారం పడుతోందని పేర్కొన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కుతోందన్నారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఉత్తుత్తి పథకమే అని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చింతల శివానందరెడ్డి, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, బుజ్జమ్మ, గంగిరెడ్డి, సయ్యద్‌జాఫర్, విజయ్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌లు పాల్గొన్నారు.

రాయితీపై డ్రిప్ పరికరాలు


మాట్లాడుతున్న లక్ష్మీ ప్రసన్న

కురబలకోట: జిల్లాలోని రైతాంగానికి 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేయనున్నట్లు జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి వై. లక్ష్మీ ప్రసన్న తెలిపారు. బుధవారం అంగళ్లులో డివిజన్ స్థాయిలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో డ్రిప్ పరికరాలు లేకుండా రైతాంగం సేద్యం చేయలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఆసక్తి గల రైతులు వీటి కోసం సంప్రదించవచ్చన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అందరికి ఆరోగ్యకరం


గుర్రంకొండ: తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరిస్తున్న అశోక్‌రెడ్డి


కేవీపల్లె : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

గుర్రంకొండ: ప్రకృతి వ్యవసాయంతో అందరికి ఆరోగ్యం కలుగుతుందని జిల్లా రైతుశిక్షణా కేంద్రం సహాయసంచాలకులు అశోక్‌రెడ్డి, కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సోమశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని రామాపురం, సరిమడుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగం ఘన జీవామృతంతో మొక్కలకు పోషకాలు అందడంతో పాటు మంచి ఎదుగుదల ఉంటుందన్నారు. మంచి నీరు 200 లీటర్లు, గోమూత్రం పది లీటర్లు, దేశీయ ఆవుపేడ 10 కిలోలు, బెల్లం రెండు కేజీలు, పప్పుదినుసుల పిండి రెండుకేజీలు, పుట్టమన్ను గుప్పెడు ఒక డ్రమ్ములో కలిపి వారం రోజుల పాటు నానబెట్టాలని పేర్కొన్నారు. ఎకరానికి వందలీటర్ల నీటిలో 5 లీటర్ల జీవామృతాన్ని కలిపి పంటలపై పిచికారీ చేయడం వలన పంటకు మంచి పోషకాలు అందుతాయని తెలిపారు. మామిడిలో సస్యరక్షణ చర్యలను నవంబర్, డిసెంబర్ మాసాల్లో చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మానవ వనరుల కేంద్రం ఏఈవో గంగాధర్, ఏఓ రత్నమ్మ, వ్యవసాయశాఖ సిబ్బంది యోగిత, రజిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పంటల సాగులో మెళకువలు పాటించాలి

కేవీపల్లె: వేరుశెనగ, అలసంద, ఆముదము పంటల కొత్త వంగడాల సాగులో మెళకువలు పాటించాలని పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపురం పంచాయతీ పెద్దకమ్మపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారని, భూసార పరీక్షలు చేపించుకునేందుకు రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. రబీలో వరి, వేరుశనగ, టమాటా పటలు సాగు చేసే రైతులు డిసెంబర్ 15వ తేదీ లోపు పంట బీమాకు ప్రీమియం చెల్లించాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మంజుల, మాధురి మాట్లాడుతూ టమాటా పంటలో వేరుకుళ్లు తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

రేపు డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. వన్,టు డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. 99592 25676 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు. ఆలాగే శుక్రవారం డిపో పరిధిలోని అద్దెబస్సుల యజమానులతో ఉదయం 12.30 గంటలకు సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ సీతారాముల విగ్రహాలు

కేవీపల్లె: మండలంలోని వగళ్ల పంచాయతీ కొండకిందపల్లెలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. కొండకిందపల్లెలో గ్రామస్తులు నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. బుధవారం శాస్త్రోక్తంగా సీతారాముల క్షణ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

బండ ఆక్రమణను పరిశీలించిన అధికారులు


పోతబోలు గాండ్లపల్లె రహదారిలో బండ ఆక్రమణను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మదనపల్లె: పోతబోలు గ్రామ పంచాయతీలో నేషనల్ హైవేకు ఆనుకుని పంటనూరి ఏడి బండ ఆక్రమణపై సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం పోతబోలు వీఆర్వో శ్రీరాములు, క్షేత్రస్థాయిలో వెళ్లి ఆక్రమణలను పరిశీలించారు. సమీప గ్రామాల రైతుల నుంచి వివరాలు సేకరించారు. వారి స్టేట్‌మెంట్‌ను నమోదుచేసుకున్నారు. బండ స్థలంగా పేర్కొన్న సర్వేనెం.141–బి2లో గతంలో మంజూరైన పట్టాలను పరిశీలించి, వెబ్‌ల్యాండ్, రెవెన్యూ రికార్డుల్లో వెరిపై చేయనున్నట్లు తెలిపారు. పరిశీలించిన అంశాలపై మండల తహసీల్దార్‌కు నివేదిక అందించి, చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎంవీఐ శివలింగయ్య

మదనపల్లె సిటీ: వాహనాదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని ఎంవీఐ దినేష్‌చంద్ర సూచించారు. బుధవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు జరిగింది. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లు మాట్లాడటం వలన రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎంవీఐ శివలింగయ్య మాట్లాడుతూ రోడ్డుపై అతివేగంగా వెళ్లడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన సైన్‌బోర్డు నియమాలు తప్పక పాటించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్ కార్డులు అప్‌డేట్ చేయాలి


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసులు

కలికిరి: ఉపాధి జాబ్ కార్డులలో మార్పులు, చేర్పులు అప్‌డేట్ చేయాలని కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు అన్నారు. స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో బుధవారం మండలంలోని ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి జాబ్ కార్డులలో చనిపోయిన వారి పేర్లు తొలగింపు, మైగ్రేట్ అయిన వారి పేర్లు తొలగించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. క్లార్ట్ యాప్‌లో ప్లానింగ్ ప్రాసెస్ పూర్తి చేయాలని, వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలలో చదువుకున్న వారుంటే ఉన్నతి పథకం ప్రోగ్రాం ద్వారా పారిశ్రామిక శిక్షణ ఇప్పించే కార్యక్రమం త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మినీ గోకులం షెడ్‌ల పనులు పూర్తి స్థాయిలో మొదలు పెట్టేటట్లు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ సుజాత, టీఏలు కె.రెడ్డిబాషా, కె.రవీంద్ర, వి.మనోహర్, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బాలలకు బంగారు బాల్యాన్నిద్దాం


మాట్లాడుతున్న ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ

మదనపల్లె సిటీ: బాలలకు బంగారు బాల్యాన్నిద్దామని ఫోర్డు సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ కోరారు. బుధవారం స్థానిక బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలలు ఆడుతూ పాడుతూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. బాల వివాహాలు జరగకుండా చూడాలని పేర్కొన్నారు. ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బాలల కోసం ప్రత్యేక హక్కులు ఉన్నాయన్నారు. బడిబయట పిల్లలు బడిలో ఉండేలా చూడాలన్నారు.

కాన్షీరామ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి


మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందిస్తున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లె: బాబాసాహెబ్ అంబేడ్కర్ సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకొచ్చేందుకు, బహుజన రాజ్యాధికారానికి బాటలు వేసిన బహుజన నేత, రాజకీయ వ్యూహకర్త కాన్షీరామ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కే.ప్రమీలను కలిసి కాన్షీరామ్ విగ్రహ ఏర్పాటు అంశాన్ని కౌన్సిల్ అజెండాలో చేర్చి సభ్యుల ఆమోదంతో అనుమతులు ఇప్పించాల్సిందిగా కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలోని బహుజనుల కోసం జీవితాన్ని, సర్వస్వాన్ని త్యాగం చేసి, మెజారిటీ సంఖ్యలో ఉన్న బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్.బాబాసాహెబ్ అంబేడ్కర్ సిద్ధాంతంతో ఒక రాజకీయపార్టీ ఉండాలని, బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించిన త్యాగధనుడు కాన్సీరామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, బాలాజి, శ్రీనాథ్, గంగాధర్, దంపెట్లశివ, గూడపల్లి శివ, సంధ్య, అనిల్, మహేష్, రెడ్డెప్ప, వేంపల్లె శివ, నల్లప్ప పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


గుర్రంకొండ: మాట్లాడుతున్న ఎంఈఓ సురేంద్రబాబు


మదనపల్లె సిటీ: సభ్యత్వం తీసుకున్న విద్యార్థులతో గ్రంథాలయ సిబ్బంది

గుర్రంకొండ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ముగింపు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ ప్రాచీన కాలంలో గ్రంథాలయాలను దేవాల యాలతో సమానంగా భావించేవారన్నారు. గ్రంథాలయా ల ద్వారా మనిషికి ఎంతో విజ్ఞానం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అహ్మద్‌బాషా, గ్రంథాలయాధికారి రెడ్డికుమారి, ఉపాధ్యాయులు షబానా, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

కలకడ: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వివిధ పోటీల్లో విజేతలుగానిలచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కలకడ క్లస్టర్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కలకడ ఉన్నత పాఠశాలలో గ్రథాలయాధికారి అమరనాథ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వైవిరమణ, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

పీలేరు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే గ్రంథాలయానికి డీఎస్సీ పుస్తకాలు వితరణ చేసిన ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డిని సత్కరించారు. ఎంపీడీఓ శివశంకర్, హెచ్‌ఎం సురేంద్రరెడ్డి, సీఆర్పీ మురళీధర్‌రాజు, ఉపాధ్యాయులు భాస్కర్, నరసింహులు, మంజుల, ఎస్ఎల్‌వీ సంజీవయ్య, గ్రంథాలయాధికారి అమరనాథ్ పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి

తంబళ్లపల్లె: విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నప్పుడే విజ్ఞానం పెరుగుతుందని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం గ్రంథాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశానికి హాజరయ్యారు. వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలలో విజేత విద్యార్థులకు బహుమతులు, మెమోంటోలు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

కలికిరి: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రంథాలయ అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ని ర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో..

జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులతో పాటు, అధ్యాపకులకు బెస్ట్ యూజర్ అవార్డులను ప్రిన్సిపాల్ డా. వెంకటేశ్వర రావు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డా త్యాగరాజన్, గ్రంథాలయ అధికారిణి డా. జప్రుస్నీషా, ఎస్వీయూ ప్రొఫెసర్ పుల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలి

మదనపల్లె సిటీ: పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఏ క్రిష్ణమూర్తి సూచించారు. స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. గ్రంథాలయం నుంచి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.